# రమ్యభారతి

మే - జూలై 2022 వెల: రూ.10/-



కొపూరి శ్రీనివాస్ స్మారక
సింగిల్ పేజీ కథల పోటీలు

## 'ఊరూరా గ్రంథాలయం' పేరుతో గ్రంథాలయోద్యమానికి నడుంకట్టి....

# ఎందరికో స్ఫూర్తినిచ్చిన గుండ్రాంపల్లి గ్రంథాలయం

**ప్రజల్ని చైతన్యపరిచి, సమాజాన్ని సరైన దారిలో పెట్టేదే సాహిత్యం. అటువంటి అనేక సాహిత్యపు గ్రంథాలను ఒకచోట చేర్చి ప్రజలకి చేరువచేస్తూ, గత 16 ఏళ్ళుగా ఇతోధిక సామాజిక సేవచేస్తు... గ్రంథాలోద్యమానికి నడుంకట్టి ఎందరికో ఆదర్శంగా నిలిచింది గుండ్రాంపల్లి యువత. అటువంటి గుండ్రాంపల్లి గ్రంథాలయం మరియు సమాచారం కేంద్రం (స్వచ్ఛంద గ్రంథాలయం) 16వ వార్షికోత్సవం సందర్భంగా 'రమ్యభారతి' ప్రత్యేక కథనం**






**గ్రామం:** గుండ్రాంపల్లి, మండలం చిట్యాల, జిల్లా నల్లగొండ –508114 (హైదరాబాద్‌కు 60 కిలో మీటర్ల దూరం). గ్రంథాలయం ప్రారంభోత్సవం : 14/04/2006

ప్రారంభకులు: ప్రముఖ విద్యావేత్త శ్రీ చుక్కా రామయ్య గారు, నాటి జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ శ్రీ గాదె వినోద్ రెడ్డి గారు.

**గుండ్రాంపల్లి గ్రామ నేపధ్యం:** ఒకప్పుడు నిజాం వ్యతిరేక ఉద్యమానికి ఊపిరి పోసిన గడ్డ, రైతంగ పోరాటానికి నెలవై, మలిదశ తెలంగాణా ఉద్యమానికి ప్రాణం పోసిన ఉద్యమాల గడ్డపై 'ఊరూరా గ్రంథాలయం' అనే మలి దశ గ్రంథాలయోద్యమం పురుడు పోసుకుంది.

**గ్రామ స్వరూపం:** విజయవాడ జాతీయ రహదారిపై గల ఈ గ్రామంలో సుమారు 7000 జనాభా కలిగివుంది. విద్యావంతులు, ప్రైవేట్ ఉద్యోగులు, రైతులుతో ఈ పరిసర గ్రామాలు 6. అన్నీ గ్రామాల జనాభా సుమారు 15000.

**గ్రంథాలయ ఏర్పాటుకు మూలం:** ఈ గ్రంథాలయ వ్యవస్థాపకులు, మరియు అధ్యక్షులు అయిన అనుముల శ్రీనివాస్ మాటలో.. "మేము ప్రాథమిక విద్యాభ్యాసం చేసే రోజుల్లో మాగ్రామంలో గ్రంథాలయం అందుబాటులో ఉండేది కాదు. మా ఊరి గ్రామ పంచాయతీకి ఒక దిన పత్రిక, ఒక మాస పత్రిక మాత్రమే వచ్చేది. మేము చదవడానికి వెళ్తే పేపర్ దొరకడం చాలా కష్టంగా ఉండేది. పెద్దవారు పేపర్ చదువుతుంటే నేను క్రింది వైపునుండి చదివేవాడిని. నేను పెద్దయ్యాక గ్రామంలో గ్రంథాలయం ప్రారంభించాలని తలిచాను. వెంటనే మిత్రులను 04,సెప్టెంబర్ 2005న మొదటి సమావేశం సరూర్ నగర్‌లోని స్నేహితుని ఇంట్లో మరియు రెండవ సమావేశం ఫిబ్రవరి 2, 2006న చిలుకూరి బాలాజీ దేవాలయ ప్రాంగణంలో సమావేశ పరచి 'మన గ్రామానికి ఏదైనా మన వంతు సాయం చేద్దాము. మన

కథ

# కథ చెప్పవా?

**- బి.వి. శివప్రసాద్**

**9848527107**



"కథ చెప్పవా తాతయ్యా?" అడిగాడు ఆరేళ్ల చింటూ.

"అనగనగా ఒక ఊళ్ళో పూటకూళ్ళమ్మొండేది..." కథ చెబుతున్నాడు తాతయ్య.

"ఇంకేదైనా కథ చెప్పు" అడిగాడు చింటూ.

తాతయ్య ఆలోచించి మరో కథ మొదలెట్టాడు. "రామవరం అనే గ్రామంలో చలపతిరావనే రైతుండేవాడు. అతను బాగానే చదువుకున్నా, మంచి ఉద్యోగం రాలేదు. వాళ్ళ నాన్న కూడా రైతే అవ్వడం వల్ల అతను చిన్నప్పటి నుంచే పొలం పనులు నేర్చుకున్నాడు. ఇప్పుడు తాను కూడా వ్యవసాయం చెయ్యడం ఆరంభించాడు. కొత్తలో బాగానే ఉండేది కానీ, తర్వాత కష్టాలు మొదలయ్యాయి. ముందుగా నీళ్ళ సమస్య వచ్చింది. బోర్లు ఎంత లోతులో వేసినా నీళ్ళు రాలేదు. కొద్దిగా నీళ్లున్నా, మోటార్లు వెయ్యడానికి కరెంటుండేది కాదు. పంటలు సరిగ్గా పండక నష్టాలు వచ్చాయి. చలపతిరావు అప్పులు చెయ్యడం మొదలెట్టాడు.

"ఎందుకని నీళ్లు లేవు? వర్షాలు పడతాయి కదా!" అడిగాడు చింటూ.

"లేదు బాబూ! మనం చెట్లను విపరీతంగా నరికి పచ్చదనాన్నీ, అడవులను పాడు చెయ్యడం వల్ల, వర్షాలు పడడం బాగా తగ్గిపోయింది" చెప్పాడు తాతయ్య.

"మంచి వర్షాలు పడాలంటే ఏం చెయ్యాలి?" అడిగాడు చింటు.

"చెట్లు నరకడం బాగా తగ్గించాలి. ఇంట్లో బయటా బాగా మొక్కలు నాటి, వాటిని పెంచాలి. అన్ని ఉళ్ళలో పార్కులు ఏర్పాటు చెయ్యాలి. మనందరం పచ్చదనం పెంచడం కోసం ప్రయత్నించాలి" అన్నాడు తాతయ్య.

"మరి చలపతి తాతయ్యేమయ్యాడు?" అడిగాడు చింటూ.

"అప్పుల్లో కూరుకుపోయిన ఆయన, టెన్షన్ తగ్గుతుందని సిగరెట్లు, సారాయి తాగడం మొదలుపెట్టాడు. అలా చెడు అలవాట్లకు బానిసై మరిన్ని అప్పులు చేశాడు. ఒకరోజు ఆయనకు గుండెపోటు వచ్చింది. ఇంట్లోవాళ్లు చాలా డబ్బు ఖర్చుపెట్టి ఆయనకు ఆపరేషన్ చేయించి బతికించారు. ఇప్పుడతను చెడు అలవాట్లన్నీ మానేసి, బుద్ధిగా వ్యవసాయం చేసుకుంటున్నాడు" కథ ముగించాడు తాతయ్య. ఐతే కథలోని చలపతిరావు తానే అని మాత్రం చింటూకు చెప్పలేదు తాతయ్య.

**వార్త:** మార్చి 27న విజయవాడలో 'కెవీఆర్ స్మారక కమిటీ' ఆధ్వర్యంలో 'కెవీఆర్ డైరీ'ల ఆవిష్కరణ సభ జరిగింది.

## కార్డు కథ
# అదీ సంగతి

"ఏంటి బావా... అలా దిగులుగా ఉన్నావు? ఒంట్లో బాగా లేదా ఏమిటి..?"

"అదేం లేదు శివా... నా దిగులంతా మన రూప పెళ్ళి గురించే.."

"మన రూపకేం బావా... పేరుకు తగ్గట్టే అందంగా ఉంటుంది. మంచి ఉద్యోగం కూడా చేస్తుంది. ఇంకెందుకు దిగులు?"

"ఎంత ఉద్యోగం చేస్తున్నా కట్నాల బెడద తప్పటం లేదురా శివా... మొన్న వైజాగ్ సంబంధం ఒకటి వచ్చింది. అన్నీ నచ్చాయి. కాని కట్నం దగ్గరే వెనక్కి తగ్గాల్సొచ్చేలా ఉంది. రెండెకరాల పొలం, ఓ ఐదు లక్షల క్యాష్, పది తులాల బంగారం కంటే ఇవ్వలేనన్నాను. వాళ్ళకేమో కోటి ఇస్తామని సంబంధాలు వస్తున్నాయట. పిల్ల పిల్లాడు ఇష్టపడ్డారు కాబట్టి ఓ అరవై, డెభ్భై లక్షలైనా లేకపోతే ఎట్లా అంటున్నారు. మన పొలమేమో ఎకరం పది పన్నెండు లక్షల కంటే చేయదాయె. సంబంధం చూస్తే వదలబుద్ధి కావటం లేదు. ఏం చెయ్యాలో అర్థం కావటం లేదురా... " అంటూ నిట్టూర్చాడు.

యధాలాపంగా అడిగినట్లు పెళ్ళి వాళ్ళ వివరాలు అడిగి తెలుసుకొని "నువ్వేం టెన్షన్ పడకు బావా... వాళ్ళే వెతుక్కుంటూ వస్తార్లే" అన్నాడు.

శివ అన్నట్లే పదిరోజుల్లో ఆ సంబంధం కుదిరి వారం తిరక్కుండా పెళ్ళి కూడా జరిగిపోయింది.

"ఒరే శివా! చాలా సంతోషంగా ఉందిరా... కాదనుకొని వెళ్ళినవాళ్ళు నువ్వన్నట్లే వాళ్ళంతటవాళ్ళే వచ్చి మనమిస్తామన్న కట్నానికి ఒప్పుకొని పెళ్ళి చేసుకోవడం ఇప్పటికీ అశ్చర్యంగా ఉందిరా..."

"రాక చస్తారా... త్వరలో మన ఊళ్ళో మెడికల్ కాలేజి రాబోతుంది. మన ఊరి పొలాలు ఎకరం కోటపైనే చేస్తాయని చిన్న అబద్ధమాడి ఆ విషయం వాళ్లకి తెలిసేలా చేశాను కదా మరి.." నవ్వుతూ కాలరెగరేస్తున్న బావమరిదివైపు ఆశ్చర్యంగా చూసాడు. **– కె. రాజేశ్వరి** 7780791215

## కవిత
# కొత్త మలుపులు

పసిపాపల జీవనవనంలో
కామోద్రేక విషకీటకాలు
సందడిచేసే
ఆనందానికి అడ్డుతగలలేని
ఆ తోటమాలి
ఉంటే ఎంత? లేకుంటే ఎంత?
విచ్చల విడితనంతో
అదుపుతప్పిన మదపుటేనుగు
బేల హృదయపు రహదారిపై
చిందులు వేస్తుంటే పగ్గం వేయలేని
ఆ మావటివాడు
ఉంటే ఎంత? లేకుంటే ఎంత?
నడిరోడ్డుమీద అఘాయిత్యం
స్వైరవిహారం చేస్తుంటే
చూస్తుండే నిస్సహాయపు కళ్ళు
వెలుగుదారిని చూపలేవు
అన్నిటితోబాటే
ఆ చీకటి చేష్టలను
దొర్లించుకుపోతున్న
కాలప్రవాహానికి
అడ్డుకట్ట వేయలేని
జనవాహినితో
సమాజమెన్నాళ్ళు మసలగలదు?
వింత పోకడల దారి మళ్ళించి
కొత్త మలుపులు తిప్పగలిగితే
వ్యూహరచనతో ముందుకొచ్చే
ధీరమానవీయతను
స్వాగతిద్దాం

**– పొత్తూరి సుబ్బారావు**
9490751681

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Ramyabharati+May+to+July+2022](http://kinige.com/book/Ramyabharati+May+to+July+2022)**

* * *